# వెన్నెల తోటలు

శ్రీధర్రావు పల్లెటూరు చూసి ఎన్నేళ్ళయింది? తన యాభై ఏళ్ళలో మొత్తం మూడు నెలలన్నా గడిపాడో లేదో పల్లెటూళ్ళో. ఈనాడు నాలుగు రోజులు గడపవలసి వచ్చింది. కరణంగారి ఇంట్లో గొప్ప ప్లీడరుగారు, ఆ జిల్లాకి కాంగ్రెసు ప్రభుత్వపు కౌన్సిల్ మెంబరు, పైగా తమవలెనే ఆరువేల నియోగులు, తన వూరు, తన యింటికి వచ్చారని గొప్ప చేశాడు కరణం. భాగ్యవంతుడైన కరణం కన్నా శ్రీధరరావు నాలుగు రెట్లు ఆస్తిపరుడు మరి.

జాగ్రత్తగా ఏళ్ళమీదట చాలా భూములూ, ఇళ్ళూ, తోటలూ సంపాదించాడు. ఆయన తెలివిగా డబ్బు సరైనచోట్ల, సరైన విధాన ఇవ్వడంవల్ల దాత అనే పేరు సంపాయించాడు. గట్టి ఆవస్తలో, ఆర్థికంగా చివరి దశలో వున్న వారి సహాయానికి ఉదారంగా వెళ్ళి వాళ్ళ ఆస్తిని రాయించుకుని, వాళ్ళ కష్టాలను గట్టెక్కించడంవల్ల వాళ్ళు ఆయనకి ఆజన్మాంతం కృతజ్ఞులుగా వుండి, అతని కీర్తిని వేనోళ్ళ పొగిడారు. వకీళ్ళలో కూడా అతనికి న్యాయవర్తనుడని పేరు వుంది. అతని స్వార్థం అతనికే తెలీకపోవడంవల్ల, ఇతరులకి కూడా కనపళ్ళేదు - స్వార్థానికి, స్వార్థాన్ని కప్పిపుచ్చే మాయ తోడ్పడడంవల్ల, ఆ మాయ ఇతరుల్నే కాదు అతన్నీ కప్పినందువల్ల అతని అంతఃకరణ స్వచ్ఛం.

ఈ కరణంగారి కుటుంబాన్ని చూస్తే, తన కుటుంబంతో పోలికలూ, వ్యత్యాసాలూ తట్టాయి అతనికి. ఒకప్పుడు పల్లెటూరి జీవనమే చాలా సౌఖ్యమనిపించింది. మళ్ళీ ఇంకోసారి ఈ పల్లెటూరి జీవితమంత నరకం లేదనుకున్నాడు. గ్రామ స్వరాజ్యంకోసం ప్రయత్నించే తన కౌన్సిలు పార్టీ కలలు తలుచుకున్నాడు. తన ఇల్లూ, ఇతని యిల్లు మల్లేనే కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు మనుమలు, మనుమరాళ్ళతో నిండి వుంది. దొడ్లో ఆవులు, గేదెలు, గడ్డిమేట్లు, బీరపాదులు, తోటకూర, పైగా మూల కంచాలు పేరిస్తే కప్పుకు అంటుతున్నాయి. ఇంకా అవిచ్ఛిన్న కుటుంబ పద్ధతి ఈనాటికీ అవిచ్ఛిన్నంగా సాగుతోంది. యజమాని సంపన్నుడూ, సమర్థుడూ, ఐతే సరి. కరణంగారి భార్యే వంట, కోడళ్ళ సహాయంతో, ప్లీడరుగారినీ గొప్పగా చూస్తున్నట్టు ఆయనకి తెలియచేసేందుకు కరణంగారు భోజనం దగ్గిర ఆడవాళ్ళని బూతులు తిడతాడు. ఉప్పు తక్కువైనాసరే, పులుసు వడ్డించడం ఆలస్యమైనాసరే. చాలా అసహ్యం, కాని తను చూసిన పట్టణపు గృహాలలో చదువుకున్న భార్యలు భర్తల్ని అనే మాటలకన్న, యీ బూతులు రమ్యంగా వినిపించాయి అతనికి.

ఈ పల్లెటూరికి, ఇప్పుడైనా, పదహారు ఎకరాల మామిడితోటని ఒక యువకుడి నుంచి అతి చవకగా కొనడానికి వొచ్చారు శ్రీధరరావు పంతులుగారు. అతన్ని తాను

ఎరిగివున్న ఈ రెండేళ్ళల్లో ఆ యువకుడు పదహారువేల రూపాయలు తాగాడు. ఇంతకుముందు కోర్టులో తాను కాపాడడానికి, రాజీలు చెయ్యడానికి ప్రయత్నించిన అతని ఆస్తి ఇంతవరకూ సరైన ధరలకే అమ్ముడుపోయింది. కనుక పంతులుగారికి ఆ ఆస్తిమీద కన్ను పడలేదు. ఈ ఏడు ధరలు పడిపోయినాయి. అదిగాక యీ తోట ఆ యువకుడి చివరి ఆస్తి. దానిమీద వున్న నాలుగువేల రూపాయల అప్పు పంతులుగారు తీర్చేస్తారు. ఆ అప్పులవాళ్ళతో బేరంచేసి వాళ్ళకి మూడువేలే ఇయ్యవచ్చునేమో అన్న ఆశ కూడా లేకపోలేదు. పంతులుగారు కరణంగారి ఇంటిని గౌరవించడంవల్ల, ఆ వూళ్ళో ఇంకెవరినీ పోటీ పడనీడు కరణం. మద్యపాన నిషేధాన్ని తన మంత్రులు పూర్తి చెయ్యకముందే యీ తోట వ్యవహారం తను పూర్తి చెయ్యాలి. అతనా? ఆస్తివుంటే తాగడమేగా అతను చేసే పని? అతనేమైతేనేం?

ఆ ఫాల్గుణ మాసపు రాత్రి పడక కుర్చీలో చుట్టకాలుస్తో పడుకున్నారు పంతులుగారు. కరణంగారి ఆవడలతో, బజ్జీలతో కూడిన భోజనం గట్టి గెదె పెరుగుతో ముగించి తన అలవాటు ప్రకారం చుట్ట కాలుస్తో వేయించిన కందిపప్పు నవులుతున్నాడు. కోసిన పొలాల మీదనించి పైరుగాలి, ఇంట్లోంచి పిల్లల భోజనాల రొద, కాలవ మీదనించి నీటి తడితో కలిసిన పడవవాళ్ళ అరుపులు, మల్లె పొదమీదనించి అప్పుడే విచ్చుతున్న పూలవాసన, తన గదికింద రేరాణి పరిమళాలు జ్ఞాపకం వొచ్చి, పట్టణంలోని తన ఇంటిమీదకి పోయినాయి ఆయన ఆలోచనలు. రెండో కొడుకు ఇంజనీరింగు కాలేజి చివరి ఏడు చదువుతున్నాడు. ఆ మంత్రిగారు కూతుర్నిస్తే, ఎంత బ్రాహ్మలకి ప్రభుత్వం కాకపోయినా, గొప్ప ఉద్యోగం తప్పదు. కూతురి వివాహం నిశ్చయమైంది. గొప్ప డాక్టరు కొడుక్కి కట్నం ఎక్కువ. కాని ఏమిటి చెయ్యడం? కట్నాల బిల్లు ఒకటి ప్రవేశపెట్టాలి తను. కాని తనకేంలాభం అది? తనకింక కూతుళ్ళు లేరు. ఈసారి కాంగ్రెసుకే విజయం తప్పదు. ఎలక్షనులో ఆయన అస్తి సంచయానికి అంత హడావిడి చేసింతరవాత, గాంధీగారిని ఇప్పటప్పట్లో మరిచిపోరు ప్రజలు, కాంగ్రెసుకే విజయం. గాంధీ విగ్రహం తన తోటలో అంత జయప్రదంగా స్థాపించి, ప్రతిరాత్రీ దీపోత్సవాలు చేయిస్తున్నాడు కదా తాను! తనకి ఒక మంత్రి స్థానం తప్పదు. అప్పటికీ ఈ పదిహేను వందల జీతాల్లోనే వుంటారా మంత్రులు! వాళ్ళు జీతాలు పెంచుకోకపోతే తనకి నష్టం. కాని వేరే విధాల లాభాలు చూసుకోవచ్చు. మరి తనకి ఏ పోర్టుపోలియో ఇస్తారో! మంత్రుల జీతాలు పెంచాలని, ఇప్పుడే తను ఒక బిల్లు పెడితే! మంత్రుల కృతజ్ఞత కలుగుతుంది. కాని ప్రతి దానికీ ఆ కమ్యూనిస్టు మెంబరు అడ్డు. భూస్వాముల బిల్లు వొస్తే అంత కష్టపడి సంపాయించిన పొలం విలువే పోతుంది. ఈ కమ్యూనిస్టుల్ని తుడిచివెయ్యగల విధానం ఏదన్నా వుంటే! కాని పొలాలకే గాని, తోటలకి ఆ బిల్లు వర్తించకుండా 'మానిప్యులేట్' చెయ్యాలి తను.

తనది గొప్ప జాతకమంటున్నారు మొదటినుంచీ జోస్యులు. ఇంతవరకూ సరిగా జాతక ప్రకారమే నడిచింది. వొచ్చేది చాలా బలీయమైన మహర్దశట. ఉచ్చ శుక్రుడు ఇరవై ఏళ్ళు వెలగబోతున్నాడు, నేడో రేపో ప్రారంభించి, ఆడవాళ్ళు కూడాట! తనకెందుకు ఆడవాళ్ళు! శృంగారంట ఏమో! కానీ, ఏం జరగాలో జరగనీ, తనకి ఆశా, ఇష్టం లేకపోతేనేం? జరగవలసింది జరగనీ, రానీ ఆడవాళ్ళని, ఈ మహర్దశలో తన జీవితం ఇదివరకు తాను అనుకోలేని గొప్ప వెలుగులతో ప్రకాశిస్తుందిట వెలగనీ, అంత వెలుగులో ఒక్క మంత్రి రాకపోతే ఇంకేం వెలుగు? ప్రధాన మంత్రి అవుతాడేమో? క్రొత్త ప్రణాళికలో గవర్నరు కూడా ఎలక్షనేట. ఏం కాకూడదా? శుక్రమహర్దశా ప్రారంభం యీ తోట కొనడంతో, మహర్దశలు మొదట్లో యోగించకూడదంటారు. కాని ఈ తోట కొనడం ఏం గొప్ప? పోనీ జరగనీ, ఓ నాలుగేళ్ళు ఆగితేనేంగాక. ఇంకా పదహారేళ్ళు మిగులుతాయి తన వైభవానికి.

అదిగాక తనకి చిన్నప్పటినుంచి ఒక సునిశితమైన ఇన్‌ట్యూషన్ శక్తి వుంది. గొప్ప మార్పు రాబోయేప్పుడంతా స్పష్టంగా ముందే తెలుస్తోవుంటుంది తనకి. ఈ వూరు రాబోయేముందు అట్లా అనిపించింది. జీవితంలో నూతనాధ్యాయం మొదలని. ఈ మామిడితోట వ్యవహారం దేనికి 'లీడ్' చెయ్యబోతోంది? ఏం కనపడదు. కాని ఏమో? శుక్రమహర్దశా ప్రారంభం మరి.

అట్లా అనుకుంటోవుండగానే ఆ మార్పు బైట గుమ్మంలోంచి లోపలికి ప్రవేశించింది. ఆలోచనల దట్టతనంవల్ల అతను గమనించలేదు గాని మార్పు గజాల దూరంలో వుందని, అతన్నెన్నడూ ఫెయిల్ కాని అతని ఇన్‌ట్యూషన్ చెపుతూనే వుంది. ఆ రాత్రే అతని శుక్రమహర్దశా ప్రారంభం.

కరణంగారి హాలులో వున్న లాంతరు నించి వరండాలో పచ్చకంబళీ లాగు ఓ భాగం కాంతి పరుచుకునివుంది. దాని అవతలగా చీకట్లోకి అనుమానిస్తో ఒకామెవచ్చి నుంచుంటోంది. అతని నోట్లో చుట్టనిప్పు చూసి ఎవరో వున్నట్టు గుర్తించిందిగావును, కాక మల్లెపూల పరిమళాల్ని మింగే చుట్ట గొప్పవాసననించో, అతనికి కనపడలేదుగాని, అరుగుకింద, మిణుకు మిణుకుమనే నక్షత్రాల కేసి చూస్తో, ఆమె చాలా అసాధారణమైన మనో వ్యవస్థలో వుంది. ఎన్నడూ చెయ్యని పని చేస్తున్నట్లో, కాక తన జీవితాన్నే ఆ నిమిషాలు, ఆ యత్నం మార్చివేస్తుందనో ఆమెకి తెలుసును గావును ఎక్కడో ఆత్మమధ్య.

శుభ్రమైన తెల్ల చీరె కట్టుకుని, తల అంత బాగా ముడి వేసుకుని, మల్లెపూలు పెట్టుకున్న స్త్రీ ఈ వూళ్ళో ఎవరు? అనుకుంటున్నాడు పంతులుగారు. ఆ చీకట్లో ఆమెవంకనించి కళ్ళు తిప్పలేక, ఆమె కదలకుండా నుంచుంది. తన మనసువేపు కళ్ళు తిప్పి, తన ఎమోషన్లకి లోపడి, బైట ప్రపంచాన్ని మరచిపోయినట్టు, ఆతృతగా వీక్షిస్తున్నట్టుంది

ఏదో గొప్ప సంగతి జరగబోతోందని, అవన్నీ పంతులుగారికి జారిణీ లక్షణాలుగా తోస్తున్నాయి. ఆ చీకట్లో సందేహిస్తో లోపలికిపోక, కనపడకుండా నిలబడడం, కరణంగారితో పని, ఏదో తగాదా తీర్చమని గావును! లేక కరణంగారి రసికపుత్రులలో ఎవరన్నా.... అయితే తన గుండెలు ఎందుకు అట్లా కొట్టుకోడం! చిన్నతనంలో ప్రథమ పర్యాయం జడ్జీముందు నిలుచున్న నిముషం తరువాత ఎప్పుడూ ఈ అనుభవాన్ని ఎరగడు ఆయన! అందులో స్త్రీలంటే ప్రత్యేకమైన దృష్టినెరగనివాడు. ఏకపత్నీ వ్రతుణ్ణని అంతవరకు రహస్య గర్వం కలవాడు శ్రీధరరావు.

అట్లా ఆ నిముషాలు ఎన్నో, ఎంతకాలం గడిచిందో తెలీదు. కరణంగారి అబ్బాయి బైటికి వొచ్చి 'ఎవరు?' అన్నదాకా.

"మీ ఇంటికి వొచ్చారట, ఆ ప్లీడరుగారు వున్నారా?"

వొణుకుతోంది ఆ అమ్మాయికంఠం గొప్ప సంతోషంతోనూ, విచారంలోనూ వున్నట్టు.

"వున్నారు ఏం?" అన్నాడు ఆ యువకుడు.

"మాట్లాడాలి."

శ్రీధరరావు మాట్లాడాలి అప్పుడు. అతనికీ మాట్లాడాలనే వుంది ఏదో వొకటి తాను అక్కడ వున్నట్టు. కాని గొంతుకలోంచి శబ్దంరాదు. చీకట్లోంచి ఆమె కంఠధ్వని వినగానే ఏవోజ్ఞాపకాలూ, చాలా అందమైనవీ, శుభ్రమైనవీ చిక్కులేనివీ, ఐన అనుభవాలు ఏవో చాలా గట్టిగా జ్ఞాపకంలో కలవరపెడుతున్నాయి.

"ఎవరు నువ్వు?" అన్నాడు యువకుడు అధికారంగా.

అదేమిటి? ఆమెతో అంత అధికారంగా మాట్లాడుతున్నాడు! మర్యాద చెయ్యడు. కూచోపెట్టడు. ఏమిటి? ఆమెని! ఈ యువకుడు! బుద్ధిలేదు అనిపిస్తోంది, శ్రీధరరావులో ఎక్కడో స్త్రీలమీద గౌరవంలేని అతనికి కూడా. కాని గొప్ప వకీలూ, ఎం.ఎల్.ఎ. ఏమనగలడు పైకి!

"నేను...."

"ఓ నువ్వా!"

అమ్మా. కొంత గౌరవం వచ్చింది. ఆ యువకుడి తల్లోకి, తెలుసుకున్నాడు, అసలు సంగతి. తనమల్లేనే. ఎవడైనా ఆ మాత్రం తెలీకండా ఎట్లా వుంటాడు!

"ఇంతరాత్రి వొచ్చావే! .... అరుగో."

ఆ మాట ఆమెకి చెప్పనక్కర్లేదు. ఆమెకి తెలుసు. బైలుదేరినప్పటినించీ తెలుసేమో, అక్కడ కూచుని వున్నారని, ఆమె ఆయన దగ్గిరకి వెళ్ళవలసిన సమయం ఆసన్నమైనదని.

వరండా మెట్లు ఎక్కుతోంది. దీపంకాంతి జోన్‌లోకి వొస్తోంది. ఒక్క నిముషం. మళ్ళీ చీకట్లోకి శ్రీధరరావు వేపు వొచ్చేసింది. ఆ వొక్క నిముషం చాలు.

అతనికి అంతరాంతంలో "ఆమె, ఆమె, ఆమే, అవే కళ్ళు. విడివిడిగా, నక్షత్రాల్లాగు, నీలోకి సూటిగా చూసే కళ్ళు, బతిమాలే చూపులు, ఇంక దుఖం, చీదరా జీవితాలకి లేనేలేవని నవ్వేకళ్ళు. అవే. ఆ పెదవులూ, అవే, ఆ నడకా అదే. తన చెయ్యి పట్టుకుని ఎక్కడికో గంతులేస్తో తేలిపోతో, లాక్కెళ్ళే నడక అదే" - అని అతని లోపల స్పష్టంగా తెలుసు. కాని ఇంకా యీజీ ఛైర్లో కూచుని చుట్టకాల్చే శ్రీధరరావుకి తన లోపలి భాష తనకే అర్థం కావటంలేదు. అంతే ఆ వొక్క నిమిషమే అస్పష్టత. ఆ మరునిముషం ఆమె సామాన్య స్త్రీ.

స్త్రీల నెరుగడు అతను. ఎన్నడూ ఒక కాంక్షతో దూరంగా నైనా అతను ఏ స్త్రీని తలుచుకుని వుండలేదు. అందమైనదంటే, అందమైనది అంతకన్న అర్థంలేదు అతనికి. స్త్రీలకోసం తంటాలు అంటే మేజిస్ట్రేటు కోర్టులో కేసు - మూర్ఖుల, రౌడీల, కులటల మలిన చరిత్ర. అంతే అర్థం అతనికి.

ఆ యువకుడు వెళ్ళిపోయినాడు.

ఆమె అతనికి పది అడుగుల దూరంలో ఆగిపోయి నించుంది. అతను చుట్టపారేసి, ఆమెవంక తలెత్తి, చీకట్లోకి చూస్తున్నాడు. వాళ్ళమధ్య ఐక్యంచేసే మల్లెపువ్వుల పరిమళం, వాళ్ళిద్దర్ని పలకరించి స్నాతకుల్ని చేసే దక్షిణపుగాలి, వీటి అర్థాన్ని కప్పిపుచ్చే చీకటి, యుగ యుగాల్నించి ఏ విధి వల్లనో హృదయాల సహజకాంతిని మింగే అంధకారం - వాళ్ళ లోపల.

"ఎవరు?" అన్నాడు. కాని అది వకీలు శ్రీధరరావు కంఠమే కాదు. అతని భార్య కూడా గుర్తించగలగదు. ఆ కంఠాన్ని, ముప్పై ఏళ్ళని ఒక్కసారిగా దులిపేసుకున్న కంఠం. వ్యవహారాలు, కొత్తదనాలు, ఆడగడాలు, అనుమానాలు. ఈ పొరలన్నిటినీ, చీల్చుకుని, అసలు ఆదరంతో, స్త్రీ పురుషుల మధ్యమాత్రం స్త్రీత్వానికైన పురుషత్వపు పిలుపు "ఎవరు?" అంటే పేరుకాదు. వూరుకాదు. కులంకాదు. అది తండ్రికాదు. భర్తకాదు. "నాకు నువ్వెవరు?" అని అర్థం ఆ ప్రశ్నకి. ఆ అర్థం ఆమెకీ ఎక్కువ స్పష్టం. అడిగిన అతనికన్నా కూడా అందుకనే పక్కనవున్న చేతుల కుర్చీ అతనికి దగ్గిరగా లాక్కుని కూచుంది. ఇంతవరకు కుర్చీలో ఎన్నడూ కూచోని ఆమె.

అంతే, నిశ్శబ్దం, మాట్లాడుకోడానికి ఏంలేదు వాళ్ళమధ్య. మాట్లాడుకుంటున్నారు. ప్రశ్నలడుగుతున్నారు. జవాబులు చెప్పుకుంటున్నారు. కాని కళ్ళు వొళ్ళు పెదిమలు ఎక్కడా

కదలవు. వూపిరి వినపడుతోంది వాళ్ళకి. శృతులు కలిపి ఒకటే లయలో పాడుతున్నాయి వాళ్ళ ఉఛ్వాస నిశ్వాస్వాలు. పడవవాళ్ళు పాటపాడుతున్నారు. దక్షిణం నుంచి సదరన్ క్రాస్‌లో పెద్ద నక్షత్రం వాళ్ళమీద మెరుస్తోంది. వాళ్ళ మనసుల్లో స్పష్టంగా తెలుస్తోంది. వాళ్ళు చిరపరిచితులమని, వారి మధ్య స్నేహాన్ని జ్ఞాపకాన్ని మించి వాళ్ళు మాట్లాడుకోవలసిన, తెలుపుకోవలసిన అవసరం తోచలేదు. అంతేకాదు. ఏమి మాట్లాడినా ఆ మౌనభాషకి ఆంతర్యమనిపించింది. అసలు వాళ్ళకి యోచనలు రానేలేదు. సాధారణత్వంలో మనుష్యుల మధ్య ఎప్పుడో తప్ప జరగని, ఏ రెండు నిమిషాలో తప్ప జరగని సంఘటన ప్రాప్తమయింది వాళ్ళ మధ్య ఆ తొలిరాత్రి జామున, కాలవగట్టు ఇంటో, దక్షిణ నక్షత్రపు వెలుగుకింద, అతని శుక్రమహర్దశా ప్రారంభంలో. మౌనంగా నిలిచిపోయినారు కాలంతో ప్రసక్తి లేకండా.

ఇంక ఎప్పుడు ఆ స్తితి ఎట్లా అంతమయ్యేదో చెప్పలేము. చుట్ట పొగలతో, మాటలతో కరణంగారు బైటికి రాకపోతే.

మామూలుగా శ్రీధరరావువేపు వొస్తానే.

"ఆ అమ్మాయి వొచ్చిందటగా మీతో మాట్లాడ్డానికి.... వెళ్లిందా?... లోపలికి దయచేస్తారా? ఏమిటి?" అంటున్నాడు.

అంటే అప్పుడే పడుకునే టైం అయిందన్నమాట. అప్పుడు చూశాడు కుర్చీలో చలనంలేని తెల్లచీరెని కరణం. 'ఓ' అన్నాడు.

ఒక నిముషం వుండి మళ్ళీ.

'ఎరుగుదురా ఏమిటి?' అన్నాడు.

వాళ్ళు మాట్లాడలేదు. శ్రీధరరావు చాలా శ్రమ పడుతున్నాడు. తన నిజ స్తితిలోనించి, వకీలత్వంలోకి, ఆతిధ్యధర్మంలోకి, హొదాలోకి రావడానికని.

కరణంగారు నాలుగు నిముషాలు అటూ ఇటూ తిరిగి 'మాటలైనాయా?" అన్నాడు.

తన మామూలు వరండాలో, ఎన్నో వ్యవహారాలు కబుర్లు పెళ్ళిళ్ళు జరిగించిన వరండాలో, ఏదో కొత్త వాతావరణం అలుముకున్నట్లు తెలుస్తోంది. అతనికి కూడా, మనుష్యుడు గనక, ఎక్కడో ఓ ఆత్మ వుంది గనక, తక్కిన ఆత్మలతో స్పందించగల శక్తి ఎంత తీసేసుకున్నా తప్పదు గనక.

"అంతకన్న ధర రాదమ్మాయీ!' అన్నాడు ఆమెతో, కరణంగారు.

ఆమెమీద అప్రయత్నమైన గౌరవం, కరణానికే కాదు, వూరివాళ్ళందరికీ, ఎక్కణ్ణించి తెచ్చాడో ఈ మనిషి, పెళ్ళికాని ఆ తాగుబోతు తన భార్యేనంటాడు. మొదట్లో అసలు తెలుగు కాదన్నారు. ఆమె కొంచెంగా ఆ వూళ్లో చనువయిందాకా. ఆ తాగుబోతు ఇంటోంచి

ఎన్నడూ కదలని ఆ అమ్మాయిని తంతాడు. రాత్రులు జుట్టు పట్టుకు ఈడుస్తాడు అంటారు. ఈమె అతని కాళ్ళు పట్టుకుని వేళ్ళాడుతుందిట. ఈ స్తితి గమనించి ఆ వూరి రసికులు ఈమెకోసం యీలలు వేశారుగాని ఏమీ ఫలించినట్టులేదు. ఆ వూళ్ళో పుస్తకాలు చదివేవాళ్ళకి ఈమె శరశ్చంద్రుడు కథానాయిక అనిపించింది. పెళ్ళిగాని భార్యలో పాతివ్రత్యాన్ని చూడలేకపోతున్నారు. మనుష్యజాతి ఏదో ఔన్నత్యానికి ఏనాటికైనా నడవడం తప్పదనే నమ్మకానికి అదే గొప్ప ఆశ. ఎంత వెక్కిరించనీ, మాయపుచ్చుకోనీ, దూషణచేస్తో మాట్లాడనీ, సరైన విలువలు మనుషుల మనసులకింద ఎక్కడో తగులుతూ వుంటోనే వుంటాయి. కాని ఏ సంగతినీ, ఎంత విలువైన అపురూపమైన సంఘటననీ తమ మనసు పై పొరల అలవాట్లతో తప్ప కొలవలేరు. మరి అర్థం కావాలి కొత్త విషయం. అర్థం కావాలంటే తమ పూర్వజ్ఞానంతో మిళితంచేసి, సమర్థించి ఓ ప్రత్యయపు పాత గూట్లోకి పంపాలి. ఆ కొత్త సంగతిని అంటుంది మానసిక శాస్త్రం.

ఎన్నడూ ఇల్లు కదలని ఆమె ఎందుకు వచ్చి వుంటుంది? తన భర్త తోటకి ఎక్కువ ధర ఇమ్మని వకీలుగారిని అడగడానికి ధార్మికుడని పేరు గాంచిన శ్రీధరరావు దయని కదల్చాలని, కాని ఏం లాభం యీమెకి? ఆ డబ్బు తాగేస్తాడు అతను. కాదు, తనకి స్వంతంగా కొంత ఇమ్మని అడగడానికి. సునిశిత బుద్ధిగల కరణంగారు సరిగా తెలుసుకున్నారు. అందుకే వొచ్చింది ఆ అమ్మాయి, లావణ్య. ఆ రాత్రి అట్లాంటి ప్రయత్నమే ఆమె మనసుని కదిలించింది. కానీ ఆమెని అంతరాళంలో కదిలించింది ఇంకో శక్తి అయి ఉండవచ్చు. ఆ శక్తివల్ల కదలగల యోగ్యత యోగ్యులకి తప్ప తక్కినవాళ్ళకి లేదు గావును. మనసుని నిశ్శబ్దం చేస్తేనే గాని ఆ వాణిని వినలేరేమో? కాని తాగుబోతువాడి శారీర బాధని తీర్చడం తప్ప ఇంకో వాంఛ లేకండా బతికిన ఆమెకి మనో విజృంభణ తక్కువైపోయి వుండవొచ్చు. వొచ్చింది మొత్తానికీ.

"అంతకి ఎక్కువ ధర రాదమ్మా ఆ తోటకి" అన్నాడు కరణంగారు. ఆ మాటలతో సంబంధం కలుపుకోవడానికి యత్నిస్తున్నాడు శ్రీధరరావుగారు.

ఆమె లేచింది. ఇంక అక్కడ తనకి పని లేదనిపించింది గావును.

"ఈమె ఈయనకి తెలుసుగావును, బంధువులేమో! మనముందు మాట్లాడరు" అనుకుని లోపలికి వెళ్ళాడు కరణం. ఇద్దరికీ తెలుస్తోంది. ఆమె ఇంటి అవతలకీ, అతను ఇంటి ఇవతలకీ, అతను ఇంటి లోపలికీ వెళ్ళే టయిమయిందని, మర్యాదస్తులు. ఆడదీ పరాయి మొగవాడూ అర్ధరాత్రిదాకా.

"ఎవరో నువ్వు జ్ఞాపకం రావడం లేదు."

చీకట్లోనే చిరునవ్వు వినిపిస్తో ఆమె "తెలుస్తుంది" అన్నట్టయింది.

"నీకు తెలుసా?"

"తెలుసు."

"ఎట్లా?"

"ఎట్లనో నాకు తెలీలేదు ఇంతవరకు" అంది, అని ఆగి మళ్ళీ.

"రేపు నా ఇంటికి రా" అని సద్దుకుని.

"రేపు మాఇంటికి ఓసారి దయచెయ్యండి" అంది.

ఆ మార్పు గమనించనేలేదు అతను.

"ఎట్లాగో చాలా గొప్పగా తెలుసు నువ్వు నాకు" అన్నాడు.

"అవును తెలుసును."

"రేపు వొస్తాను."

"వొస్తావులే... కాని... రేపు తప్పకుండా ఓసారి దయచెయ్యండి" అంది మళ్ళీ.

మెల్లిగా లేచి వెళ్ళిపోయింది ఆమె.

ఆ రాత్రి నిద్రపోలేదు అతను. పక్కమీద కూచుని కిటికీలోంచి ఆలస్యంగా పూసిన మామిడి పూతలలో ఆడుకునే మినుగురు పురుగుల్ని చూస్తున్నాడు. కొంచెం సేపటికి ఆ మామిడిచెట్టూ దాంటో మినుగురు పురుగులూ, నిద్రలో కలవరించే పిట్ట మూలుగూ, కీచురాయిలూ, అదో ప్రపంచమనిపించింది. నల్లని రాత్రిలో అదో పట్టణంలో చాలా కోలాహలం. కొన్ని జీవితాల పర్యవసానాలు, ప్రేమలు, పుట్టుకలు, చావులు, ఉత్సవాలు అన్నీ క్షణికంగా జరిగి పోతున్నట్టనిపించింది. మెల్లిగా నవమినాటి చంద్రుడు పుబ్బతో ఉదయిస్తున్నాడు. ఆ చెట్టు ప్రపంచానికి చంద్రోదయం ఏమనిపిస్తుందో! ఆ కాంతి పెద్ద వెలుగౌతుందా? లేక ఆ కాంతిని భరించలేని కీటకాల కళ్ళకి అంధకారమౌతుందా? ఆ చంద్రబింబం ఒక లోకమా? ఆ నలుపు కొండలా? కాదు తోట.

వొళ్ళు ఝల్లుమంది. ఆకారణంగా అతనికి అద్భుతంగా అనుభవంలోకి వచ్చిన మూడు సన్నివేశాలు జ్ఞాపకం వొచ్చాయి.

తను కుర్రాడు, ఎండాకాలంలో ఎండడంచేత కాలవనీళ్ళలో దిగి దాటి బడికి వెడుతున్నాడు. ఆ ఉదయంనించి కూడా మనసు చాలా ఉత్సాహంగా వుంది. ఏం ఆశ్చర్యకరమైన విషయం జరగకూడదు. ఈ విచిత్రమైన ప్రపంచంలో అనిపిస్తోంది. బడి తగలబడి వుండొచ్చు. టీచర్లు మేకలై పోవచ్చు. ఆ నిమిషాన ఎండలో పెద్ద మెరుపు మెరిసినట్టయింది. తన కళ్ళముందు కాలవకట్టా, దానిమీద సీమచింతచెట్లూ మాయమై నాయి. ఉత్త ఆకాశం, పెద్ద తోట, చాలా అందమైన తోట, అన్నీ వింతరంగుల పువ్వులు.

ఈ రంగులే కాని ఆ రంగులకి మెరుగు, ఆ తోటలో వూరికే పరిగెత్తాలనీ, నవ్వాలనీ, ఇటూ అటూ చూడాలనీ అనిపిస్తుంది. వెళ్ళాడు ఆమె వొళ్ళోకి. ఆమె తనది అని తెలుసు. మెడని కావలించుకుని ఆమె చంపమీద చెంపనానించాడు. ఆమె చేతుల్లోంచి వేళ్ళలోంచి అతనికి చెప్పలేని సంతోషం అతని లోపలికి.

"వొచ్చావా?"

అని గట్టిగా వొత్తుకుని, దూరంగా పట్టుకుని అతన్ని చూస్తోంది, "ఇప్పుడు ఈ రూపంగా వున్నావా?" అన్నట్టు.

"జ్ఞాపకం వున్నానా?" అంది.

'ఊఁ' అన్నాడు గోముగా.

'అంతా జ్ఞాపకం వుందా?'

ఉంది అప్పుడు. కాని అంతా ఏమిటో అటు తరువాత జ్ఞాపకం లేదు. తటాలున అతను ఆమె మీదికి వొరిగిపడి ఏ సంకోచం లేకుండా ఆమె రొమ్ముమీద నించి పమిటని.... అంతే.

కాలవలో నాలుగు అడుగులు వేశాడు. ఈ లోపల తను ఆగాడు. కాళ్ళీడ్డుకుంటో, పెన్నిధిని పోగొట్టుకుంటున్న వాడివలె వెనక్కి చూసుకుంటో బడికి వెళ్ళాడు. చాలా ఆలిస్యమయిందనుకుంటూ, కానీ ఏమీ ఆలస్యం కాలేదు.

ఆ కల అట్లా వుండిపోయింది చాలా రోజులు. అంతా నిజంగా జరిగిందని సందేహించలేకపోయినాడు చాలా రోజులు.

యవ్వనం, తన పెళ్ళి అనుకుంటున్నారు. పదిహేడేళ్ళ కుర్రాడికే. గంతులేసుకుంటో పోతున్నాడు. గాజు గొట్టంలోంచి సబ్బు బుడగలు వూదుకుంటో, బళ్ళమధ్య మనుష్యుల మధ్య రోడ్డు మీద రంగులతో గుండ్రంగా తిరుగుతోంది. పెద్ద బుడగ ఎగురుతోంది చాలా పైగా. నిలబడి చూస్తున్నాడు. రోడ్డుని మరిచి పగులుతోంది బుడగ. దాంటో ఒకామె రూపం. ఆ ఆ పడుతుంది. రోడ్డుమీద అనిపించింది. ఆమె తన నెత్తిమీదికి పడుతోంది. ఏటవాలుగా, దగ్గిరిగా వొచ్చి తనని చేతులతో ఎత్తివేసుకుంది. పైకి వెళ్ళిపోయినాడు. మళ్ళీ అదే తోట ఇదివరకటి స్తలానికే తీసుకువెళ్ళింది. అట్లానే వుంది ఆమె. చెట్టుకింద పడుకుని పక్కన కూచోపెట్టుకుంది. ఆమెని చూడగానే గొప్ప ప్రేమ వొచ్చింది అతనికి. జీవితం అనంతమైన ఆనందమనిపించింది.

'ఏదిగావే? చిన్న మీసాలు కూడా వొస్తున్నాయి?' అని తనని వొళ్ళంతా తాకింది. ఇంకా ఇరుకైన లాగులు వేసుకుని, నూనెకి ఆణగని జుట్టుతో, సిరామరకల వేళ్ళతో, ఇంటిదగ్గిరా, బళ్ళో చివాట్లుతినే కుర్రాడు కాదు అతను, ఎవరో గంధర్వ కుమారుడు.

'రా ఆలస్యం చెయ్యకు' అని చేతులు జాచింది ఆమె. ఆ పచ్చని గడ్డిలో, కలకల నవ్వే పూల మధ్య ఆమెని కావలించుకున్నాడు నిలువునా, తన కొత్త యవ్వనానికి అర్థం తెలిసింది అతనికి.

'నీకు పెళ్ళి కదూ?'

'చేసుకోను'

'చేసుకుంటావు. చేసుకో, నేనేమౌతాను?' అంది..

'కాదు నువ్వే నువ్వే' అని ఆమె రొమ్మును వెతికాడు.

'జట్కా, జట్కా తోవ, తోవ.'

అంటున్నారు వెనకాల. చేతిలో సబ్బునీటిబుడ్డీ గొట్టం. ఒక్క ఆడుగు కూడా ముందుతి సాగలేదు. అతను అంతసేపట్లోనూ ఆ కల చాలాకాలం వేధించింది అతన్ని.

తన కొడుకు ఎదుగుతున్నాడు. కాంగ్రెసు ఆదేశాన జైల్లో వున్నాడు అతను. బైట వెన్నెల. లోపల నిద్రపోతున్నారు అందరూ, ఇనప కటకటాల మధ్యనించి వెన్నెల. చందమామ ఇటువొచ్చి కనపడతాడా అనుకుంటున్నాడు. నిద్రలేక యోచిస్తో, స్త్రీ సంపర్కం లేక బాధగా వుంది కొన్ని రాత్రుల నించి.... నీడలు చిన్నవౌతున్నాయి.... చందమామ ఆకాశంలో వొంగాడు. చంద్రబింబం కేసి చూస్తో నుంచున్నాడు తలెత్తి. మెల్లిగా చంద్రుడు దగ్గిరగా వచ్చాడు. కళ్ళ ముందుకి దగ్గిరగా వొచ్చాడు. టెలిస్కోపులో మల్లే. ఆ బింబం మధ్య - ఆమె.

'రా'.

బైటికి పైకి తీసుకుంది అతన్ని, వెళ్ళిపోయినారు ఇద్దరూ! మళ్ళీ ఆ తోటలోకి. ఈసారి అతనికి అదంతా కలో. ఇదివరకు మల్లే మెళుకువలో జరిగిందో తెలీదు. చాలాసేపు జరిగింది.

'ఇంకా ఎన్నాళ్ళు ఈ ఖైదులో?' అంది అతన్ని సరోవరం మెట్టు మీదికి తీసుకెడుతో, పక్కన కూచోపెట్టుకుని 'సుఖంగా వుందా జీవితం?' అంది. ఆమె తనకి పూర్వం కనపడ్డట్టు జ్ఞాపకాలు, ఇన్నేళ్ళేమైనావు? అని అడగాలని అతనికి. కాని అడిగే వ్యవధి లేదో, మరుపో, అడగలేదు. ఈసారి అనుభవజ్ఞుడు, అతనే ఆమెని కామించాడు. తన చేతుల్లో ఆమెకి అంత ఆనందం ఎందుకో అర్థంకాదు అతనికి. ఆమె మనుష్య స్త్రీ కాదు, అనుకున్నాడు.

'నువ్వొక్కత్తెవేనా ఇక్కడ?' అన్నాడు, ఆమె కళ్ళల్లోకి చూసి.

'ఊ' అంది పెదవులకి వీలులేక. ఆమె పెదవుల్ని వొదిలి మళ్ళీ అడిగాడు.

'నేను లేనప్పుడు?'

'నేనూ లేను.'

'లేక...'

'వుంటాను. ఇట్లా కనపడుతో వుండను.'

'నాకోసమా?'

'నీకోసమే, రా మరి.'

ఆ వెన్నెల మామూలు వెన్నెల కాదు. ఆ గాలీ మామూలు గాలి కాదు. చిన్నతనంలో మొదట చూసినప్పటికన్న గొప్పగా, శుభ్రంగా, ఆశ్చర్యంగా... ఎవరూ? ఈమె ఎవరు? కాని అడగడం అనవసరం. తనది - తనకోసమే.

"బావున్నానా?" అంది.

'ఎందుకు అడుగుతావు? నీకు తెలీదా?'

'ఇంకా బావుండాలని నీకనిపిస్తే...'

'కాగలవా ఇంకా అందంగా?'

'ఊ... కాని నీకు అసలు ఆ అందం దొరక్కపోవచ్చు. తెలీక పోవచ్చు.'

'ఏమీవద్దు, నా దగ్గిరికి చాలా దగ్గిరికి... మాట్లాడకు, నాలో ఐపో...'

ఎంతసేపో...

ఆమె లేచి నుంచుంది.

"ఇంక వెడతావా?"

'నన్నెందుకు ఎప్పుడూ వుంచుకోవూ?'

'వుంటావా, అందర్నీ వొదిలి?'

అవును. ఎట్లా వుంటాడు?

'అదీగాక, నేనీరూపంలోనే చాలాకాలం వుండలేను.'

'ఏమిటి?'

ఆమె మాట్లాడలేదు. ఆమె మనసులోకి ఆలోచన వస్తోంది. ఆలోచనలోకి రావడం గాజు గ్లోబ్‌లోకి, వెలుతురు రావడం మల్లే కనిపిస్తోనే వుంటుంది. ఆమె కళ్ళల్లోంచి అంత నిర్మలం ఆమె మనసు.

'ఇంక నీకు కనపడను ఇట్లా!'

'ఏమిటి? కనపడవూ?'

'కనపడతాను. ఈ రూపంలో ఇంక ఇంతే - ఈ జన్మకి నీకు.'

'ఏ రూపంలో కనపడతావు? నాకెట్లా తెలుస్తుంది?'

'తెలీదు ఏ రూపమో! నువ్వు తెలుసుకోవాలి. తెలుసుకోగలవనే.'

'నువ్వు చెప్పరాదూ?'

'నాకైనా నువ్వు గుర్తు వొస్తావో రావో! పోనీలే, ఎట్లా! వోలాగు కనుక్కుంటాలే నిన్ను.'

'వొదలకు నన్ను, వెళ్ళను.'

కాని తన ప్రయత్నం లేకుండానే తాను వెడుతున్నాడు. కన్నీళ్ళతో చేతులు జాచి నుంచున్న ఆమె నించి, దూరంగా ఎవరో తీసుకెడుతున్నారు. తనని కటకటాల వెనకకి.

ఇంత గొప్ప అనుభవాల్ని ఎట్లా మరిచిపోతాడో మరిచిపోతాడు తను ఎప్పటికప్పుడు. ఈ రాత్రి ఎందుకు జ్ఞాపకంవొచ్చాయో!

మళ్ళీ కనపడనన్నది ఆమె. లేకపోతే ఈ రాత్రి ఆ వెన్నెల్లోంచి తనకోసం రాబోతుందని నిశ్చయంగా తెలుస్తున్నట్టుగా వుంది, వొస్తుందేమో ఏ రూపంలోనో!

తెల్లార్లూ నిద్రలేదు. ఆమెకోసం గొప్ప విరహంలో బాధపడ్డాడు. ఆ మూడు నిమిషాల అనుభవాలు తప్ప అతనికి జీవితంలో ఏమీ సారం కనపించలేదు. ఆనాడు ఆ రాత్రి ఆస్తి, పిల్లలు, సంసారం, తన వాంఛలు, తన ఆశలు ఎంత అల్పం? ఏం చేస్తున్నాడు ఇన్నేళ్ళు తాను?

తెల్లారకట్ట ఎప్పుడు నిద్రపట్టిందో, బాగా ఎనిమిదింటికి నిద్రలేచాడు. ఆమె ఇంటికి వెళ్ళాలనే ధ్యాసతోనే. తొమ్మిదింటికి బైలుదేరాడు. ఉప్మా పొట్టనిండా తిని తేన్చుకుంటో.

వూరిబైట సొంత తోటలోనే ఆమె ఇల్లు. ఇల్లేమిటి అదో గుడిశ. అతని రాకకు ఎదురు చూస్తోందో, ఎప్పుడూ అంతేనో, ఇంటిముందు చంపక వృక్షం కింద తివాసీ వేసుకుని కూచుని వుంది.

మొదట అతన్నీ కొత్తగా చూసింది. తరవాత అనుమానంతో.

'మీరేనా?' అంది.

తనూ 'నిన్న రాత్రి ఆమేనా ఈమె?' అనుకున్నాడు.

'నువ్వేనా?' అంది.

ఆమె దగ్గిరికికి ఈనాడు తను వొస్తోంటే, తన కలలలో సరస్సు ఒడ్డున ఆమె దగ్గిరికి వెడుతున్నాననిపించింది.

ఇద్దర్లో ఎవరూ అనుకోకుండానే ఆయన ఆమెకి దగ్గిరగా, ఎదురుగా, చాలా మిత్రులవలె, బాగా చనువైన ప్రియులమల్లే కూచున్నారు. తరువాత ఒక్కమాట మాటలేదు వాళ్ళమధ్య.

ఎండ చారలుగా గడ్డిలో నీలం పువ్వుమీద మంచుబొట్ల మీదా, కొబ్బరాకుల నునుపు మీదా, జుట్టుమీదా, బుజం మీదా శిరీష పుష్పాల మీదా పడుతున్నాయి. పక్కన మెట్టతామరపూలు గాలిలో వూగుతున్నాయి. చిలకలు ఆకుపచ్చ మెరుపుల మల్లే పరిగెత్తుతున్నాయి. తేనెపిట్టల ఈలలు ఇంకా ఆగని కోయిలల అరుపులు, ఆమె మీద అంతా కొబ్బరాకుల నీడలు.

వాళ్ళిద్దరి మధ్యా - దగ్గిరికి జరగాలి ఒకరినొకరు ఆ నిమిషాన, ఆ స్థలంలోనే తీసుకోవాలనే అనివార్యమైన ఆకర్షణ.

ఎండ తోట మూలమూల సందుల్లో చెట్లకిందనించి చీకట్లని తరుముతోంది. చెట్ల ఆకుల సందుల్లోంచి నీలం ఆకాశం వాళ్ళ మనసుల శాంతితో ఐక్యమవుతోంది. పక్షుల అరుపులు ఆలసటనీ ధ్వనిస్తున్నాయి. కొంచెం చెమట పడుతున్న శరీరానికి గాలి తగిలి ఆహ్లాదమిస్తోంది.

కాని వాళ్ళ కళ్ళూ మనసులూ పనిచెయ్యడంలేదు. కళ్ళు మూసుకుని కూడా తెలుసుకోగలరు ఒకరి నొకరు. ఇద్దరి మధ్యా వూపిరాడని ఆకర్షణ. ఆ చెట్లూ ఆకాశమంతా వాస్తవంగా దృఢంగా దగ్గిరికి తీస్తోంది. వాళ్ళని, కాని తొందరా, ఆరాటమూ, లేని గొప్ప శాంతితో, ఆ ఆకర్షణే ఆకర్షణకి, అర్థమూ అంతమూ ఐనట్టు అవతరించింది.

చాలాసార్లు అతను ఆమెని దగ్గిరిగా తీసుకోడానికి చెయ్యి ఎత్తుతున్నాడే అనిపించింది. మైకంలో మల్లే ఆమె తల అతని రొమ్ముమీదికి వాలిపోదా ఏ నిమిషానైనా అన్నట్టే వుంది.

ఏం జరిగేదో, రోడ్డు దుమ్ముతో, చెమటతో, ఎర్రటి తాగిన కళ్ళతో, ఆమె భర్త వాళ్ళ కెదురుగా వొచ్చి నుంచోకపోతే. ఎంత శబ్దం లేకుండా వొచ్చాడో, వాళ్ళు గమనించే స్థితిలో లేరో! అందాకా తెలీనే లేదు వాళ్ళకి. అట్లా ఓ నిమిషం చూసి వాళ్ళవంక, గుడిశవేపు వెళ్ళాడు. పందిరికింద వున్న కుర్చీకేసి చూస్తో నిలబడ్డాడు.

ఆమె లేచి నుంచుంది. శ్రీధరరావు నుంచున్నాడు.

'వెడతాను' అన్నాడు.

'మళ్ళీ రాత్రిరా' అంది.

ఆమె తన ఇంటివేపు తిరిగింది. అతను రోడ్డువేపుగా వెళ్ళిపోయినాడు.

ఆనాడు శ్రీధరరావుగారి భోజనమయ్యేటప్పటికి రెండుగంటలు దాటింది. ఇంటిల్లిపాదీ అతని కోసం కాచుకుని వున్నారు. పాపం ఎట్లా ఇంటికి వెళ్ళాడో ఏం తిన్నాడో మాట్లాడాడో అతనికి తెలీదు. మధ్యాహ్నం పక్కమీద పడుకుని అదే ఆలోచన అతనికి.

ఆమెకి 18 ఏళ్ళుంటాయో లేదో, తనకి యాభై ఏళ్ళు దాటాయి. ఆమెని చూస్తే, అతను ఆమెలో ఎందుకు అట్లా అవాలో కారణం లేదు. ఆమెకి ఏమీ అందమూ లేదు. గ్లామర్ కూడా లేదు. తన కలల సుందరిని ఈమె ఎందుకు జ్ఞాపకం చెయ్యాలో కూడా అర్ధంకాలేదు. ఈ వ్యవహారానికి పర్యవసానమేమిటని అతను ఆలోచించనేలేదు.

ఓసారి అతను ఓ దివ్యజ్ఞాన సమాజం ఆయన లెక్చర్లు విన్నాడు. మూడు రోజులు వరుసగా, శ్రీధరరావుకీ మతమూ, దేవుడూ, పరలోకం ఇట్లాంటి ధ్యాసలు లేవు. ఎప్పుడో చస్తాం. తరవాత పుడతాం. అదంతా ఎప్పుడో.... అనేది, మనసు వెనకాల వుంది. అంతే ఎందుకు వెళ్ళాడో సభలకి వెళ్ళాడు. ఆ ఉపన్యాసకుణ్ణి చూస్తే ఇష్టం కలిగింది. ఏదో మామూలు వ్యవహారాలకి కాక, ఇంక దేనికో బతికి కృషిచేసినవాడిమల్లే వున్నాడు. ఆయన మాట్లాడే ఊర్ధ్వలోకాలూ మహాత్ములూ, వింటే వొళ్ళుమండింది. కాని ఆయన ఏదో అనుభవంతో అధికారంతో మాట్లాడుతున్నాడనిపించింది. ఏ ఆశ లేకుండా ఎందుకూ వూరూరా యీ ఉపన్యాసాలు? కాని మనిషికో పిచ్చి, ఆ ఉపన్యాసాలు వింటోంటే తన అపూర్వమైన అనుభవాలు జ్ఞాపకం వచ్చాయి. వాటికి ఆయన ఏమన్నా సమాధానమో అర్థమో చెపుతాడేమో! పైగా తనకి అట్లాంటి అనుభవం వుందంటే, ఆయన దృష్టిలో తాను ఉన్నతమైన మనిషిమల్లే, ఇంకా మొగ్గలో వున్న మహాత్ముడిమల్లే కనిపించవొచ్చు అని కూడా అతని లోపల వుంది. కాని ఆయన ఏమీ తననిగాని తన అనుభవాల్నిగాని ప్రత్యేకంగా చూడలేదు ఏమిటో ఆయనకో ఆయనతో ఉన్నవాళ్ళకి ఇట్లాంటి గొప్పవీ ఐన, మానుషాతీతమైన దృశ్యాలు సర్వసాధారణమైనవన్నట్టు మాట్లాడాడు.

అట్లాంటి అనుభవాలు తనకి ప్రత్యేకం కావేమో. ప్రతి మనిషికీ వుంటాయేమో తన మల్లేనే మాట్లాడరేమో! ఆయనతో చెప్పాడు.

'చాలా నిజంగా కనపడతాయి. నిజంగా జరిగాయంటారా? అసలు నమ్ముతున్నారా నేను నిజం మాటలాడుతున్నానని!'

"నమ్ముతున్నాను. అవి వాస్తవమా అంటే? సాధారణ లోకంలోని అనుభవాలు ఎంత వాస్తవమో అవీ అంతే వాస్తవం."

"ఇవీ అవీ కూడా మాయ అంటారా?"

వాస్తవం, మాయా, అనే పదాల అర్థం మీద ఆధారపడుతుంది. ఒక విధంగా చూస్తే ఇవన్నీ మాయ. ఇవి మనకి ఇచ్చే అనుభవమే వాస్తవం. ఇంకా తరచి చూస్తే మనం అనుభవం మాయ. అనుభవాన్ని అనుభవించే పదార్థమే వాస్తవం. ఇంకా తరచి చూస్తే...

"నా ప్రశ్ననించి తప్పించుకుంటున్నారు."

"మనం విచారణ చేసినకొద్దీ, వీటన్నిటినించీ తప్పించుకోడమే జరుగుతుంది, ఏదీ చేతికి దొరకదు."

"అట్లాకాదు. నేను కలలో చూసిన తోటా, సుందరీ, నేను మామూలుగా చూసే తోటలూ, మనుషులూ అంత వాస్తవమౌనా లేదా? అని అడుగుతున్నాను."

"అవును."

"ఈ తోటలమల్లేనే, ఆ తోటా ఒకచోట ఎక్కడో స్పేస్‌లో వుందంటారా? మరి అంత పెద్ద అనుభవం ఒక్క క్షణంలో ఎలా జరిగింది?"

"మరి కలలూ?"

"ఇట్లాంటివి అర్థం చేసుకోవాలంటే, కాలమూ, స్థలమూ అనే ప్రత్యయాల అలవాటునుంచి మనసుని తప్పించాలి. చాలా కష్టం అది. కనక నేను చెప్పే మాటలు తప్పించుకోడంలాగే వినిపిస్తాయి. మీరు ఈ లోకంలో చూసే తోట మీరు చూడనప్పుడు అక్కడ ఉందని నిశ్చయమేమిటి? నవ్వకండి ఇంకా అర్థం కావాలంటే మీకు మీరు ఆ అనుభవంలో చూసిన ఆ తోట మీరు యుగాలనించి, గట్టిగా కోరుకుంటున్న దృశ్యం. మీరే నిర్మించుకున్నారు. ఆ తోటని."

"మరి అందరూ కల్పించుకోగలుగుతున్నారా?"

"అందరూ అంత గట్టిగా కోరుకోటంలేదన్నమాట. మన కోర్కెలు బలమైనకొద్దీ మన అనుభవాలు చాలా దట్టమైన స్థిరమైన రూపాలు ధరించి ఎదుట పడతాయి. మన కలలు మనలోని తేలిక వాంఛల రూపాలు. అందుకనే వాస్తవత్వం తక్కువైనట్లు తోస్తుంది వాటిల్లో."

ఇట్లా మాట్లాడాడు. చాలాసేపు. శ్రీధరరావుకి అర్థం కాలేదు.

"మీ కోర్కె ఇంకా బలమైనప్పుడు, ఆమె ఆ నిజస్వరూపం యీ లోకంలోనే మీ చేతుల్లోకే దిగుతుంది."

"చాలా బలంగా వుంది?"

"చాలా బలంగా వుంటే, యీ వృత్తీ, యీ ఆస్తీ, వీటన్నిటి మీదా ఎందుకు వుంటుంది మీ మనసు? ఆ బలమంతా చాలా లోపల దూరంగా వుంది. మనసు పై పొరలోకి దిగలేదు ఇంకా! దిగిననాడు మీ మనసే ఆ రూపాన్ని ఆ స్త్రీగా నిలువుతుంది మీ ముందు."

ఆయన మాటలు ఏవో చెబుతున్నాయి. కానీ ఏమీ తృప్తి నియ్యలేదు. అతనికి.

ఈనాడు తాను ఆమెని కలుసుకోడానికి ఎట్లా వెడతాడు? కరణంగారితో ఏమి చెపుతాడు? ఆ భర్త సంగతేమిటి? ఈ ఆలోచనలు లేనేలేవు. చాలాదూరం. మర్యాద,

భీతి, నీతి, ఇట్లాటి భావాలు ఎక్కడికి పోయినాయో! ఆ దివ్యజ్ఞాని చెప్పిన మాటలు నిజమౌతున్నాయి. కాని శ్రీధరరావుకి తెలీటంలేదు. ఆ రాత్రి వెడతానా, ఎట్లా వెడతాను? అనే ప్రశ్నే లేదు. సూర్యుడినించి వొచ్చేకాంతికి సందేహం లేదు, భూమి ఎక్కడవుంది? ఎట్లా వెళ్ళాలి? ఎంతదూరం? వెళ్ళకపోతేనేం? ఎండ నాట్యం తొక్కే వేపచెట్టు చిగుళ్ళు ఎండకి, నీకెవరు? అనిపించును. కిటికీలోంచి కనపడే లేత చిగుళ్ళమీది తళతళా చూస్తోవుండి కూడా తెలుసుకోగల యోగ్యత అతనికి వుంటే.

పొద్దుపోయిగాని రానని చెప్పి బైట పక్క వేయించుకుని వెళ్ళాడు. చీకట్లో అతనికోసం చూస్తోంది. వెళ్ళగానే కావిలించుకుంది. పెదిమల మీద పెదిమలు, రొమ్ముకి రొమ్ము పెనవేసుకుంది. ఇద్దరూ ఆ చోటే రోడ్డుకి కొంచెం దూరంలోనే పడిపోయినారు. పైన నక్షత్రాల వెలుగు వాళ్ళ మధ్య మిణుగురుల కాంతి గీతలు. అతనికి వయసు, మర్యాద, భవిష్యత్తు ఏమీ లేని స్థితి.

మళ్ళీ దశమినాటి చంద్రుడు వాళ్ళని మెల్లిగా తాకి మెళుకువ నిచ్చాడు. అప్పుడూ కొంచెం మాటలు, మూమూలు మాటలు కావు. ఒక్క చిన్న మాటతో సమస్తమూ అర్థమయ్యే మాటలు, మామూలు ప్రియులు మనసు చీకట్లలో అర్థాలకి వెతుక్కోవడాలు కావు. మాటలు మనసుల్ని మరుగు పరచటంలేదు. ఒకరికింకోరు. వాళ్ళ దేహాలు, కొంతసేపటికింద ఏ రహస్యమూ లేకుండా తెలిసినంత స్పష్టంగా వాళ్ళ మనసులూ, హృదయాలూ, ఇంకోరికి తెలుస్తున్నాయి. అతని కళ్ళలో ప్రశ్నకి ఆమె.

"పెళ్ళయింది. నీకోసం ఎదురు చూస్తున్నాను ఈ తోటలో."

"మరి నా సంసారం...." అని అతను.

"అవును, వొదలలేవు. ధర్మం ఉంది నీ మనసులో దయ నా మనసులో... వెళ్ళు."

వెళ్లి ఏం చెయ్యగలను అనే నిశ్చయమైన సూనృతం ఆమె మెడమీదనించి ఆమె రొమ్ము మీద పడుతున్న అతని వేళ్ళ బిగువులో.

"నన్ను తీసుకుపోలేవా?" అని ఆమె తలబరువులో అతని రొమ్ముమీద.

"వెళ్ళి.... ఆ మనుషుల మధ్య అవమానం, నా మిత్రులు, కొడుకులు... మనుషులు..." అంటో అరుస్తోంది అతని మనసు.

"ఒక్క నిమిషం నీ నించి విరహం..."

"మనిద్దరం కలిసివుండకపోతే జీవితానికి అర్థం....."

నిశ్శబ్దంలోనే ఈ శబ్దంలేని సంభాషణ.

మనసులు కూడా నిశ్శబ్దం, తరవాత - ఒకరిలో ఒకరు. వెన్నెలపడే ఆ బుజం వొంపు అందంలేని అతని మీసాల చివళ్ళ వెండి మెరుపుల్లో ఆమె దృష్టి.

చివరికి....

"నాకిదివరకు కనపడ్డ జ్ఞాపకంవుందా?..." అని అతనినించి మాటలు.

కాని ఆమె ఎవరు? ఈమె ఎవరు? ఎందుకు అడుగుతున్నాడు? ఈమెనీ తన మనసు కాంక్షించి కల్పించుకుందా? అని దివ్యజ్ఞాని రేపిన సందేహం.

"లేదు. నువ్వు చెపుతోవుంటే ఏదో దూరం జ్ఞాపకం కాబోలునని."

మళ్ళీ నిశ్శబ్దం.

గుడిశవేపునించి అలికిడి.

"నీ భర్త! ఏమనలేదా అతను పొద్దున్న!"

"తాగి, లేని ప్రియుల్ని నాకు కలిపిస్తోనే వున్నారు. రెండేళ్ళూ ఈనాడు నువ్వూ అంతే అతనికి."

మళ్ళీ దివ్యజ్ఞాని మాటలు - తాగినవాడికి కూడా ఈ లోకం వుత్తనీడ. వాస్తవానికి ఊహకీ భేదం తక్కువ.

"మనం ఇంక విడిపోవద్దు. ఏమైనాకానీ" అని అతను ఆమె పెదిమెల్లోకి అంటున్నాడో అనుకుంటున్నాడో?"

తన భార్యతో మామూలుమల్లే, తరవాత తనకి అలసటా లేదు నిద్రా లేదు. పైగా మనసు బాగా మేలుకుంది.

"లాభం లేదు" అంటోంది ఆమె జాలిచూపు వెన్నెలపడే అతని కళ్ళల్లోకి.

ప్రస్తుతపు నిమిషంతప్ప ఎంత బలవంతం చేసినా, మనసులు కదలటం లేదు. కాలంలో వెనక్కిగాని ముందుకుగాని, కలిసివుంటే ఒకరినించి వొకరు దేహాలుకూడా విడిపడి వుండలేరు. అది అసాధారణం, వికృతం, ఈ లోకానికి.

వెన్నెట్లో పెనవేసుకున్న వాళ్ళముందు భర్త, శ్రీధరరావు డొక్కలో ఓ తన్ను, పెద్ద కేకలు, ఆమెని జుట్టుపట్టుకుని ఈడుస్తున్నాడు. తనవంక నిస్సహాయంగా చూసే ఆమెని, ఆ చెట్ల నీడల్లోకి.

మనుషులు, రోడ్డుమీద బళ్లు.

చప్పున వెళ్ళి ఆ భర్తమీద పడుతున్నాడు శ్రీధరరావు.

"వెళ్ళు నువ్వే వెళ్ళిపో" అంటోంది ఆమె.

అతనితో కలబడపోతున్నాడు భర్త, అరుస్తో.

"వెళ్ళు పో. నా ఆజ్ఞ" అని విరబడిన జుట్టులోనించి ఆ రహస్యం వంటి ఆమె వాణి.

ఇంక తన కోపం, పురుషత్వం, ఈర్ష్య, ఆమెని వదలలేనితనం, ఆమె అపాయం - వీటి నన్నిటినీ మించి, తన మెడని వొంచే ఆమె ఆజ్ఞ.

చప్పున చేతులు వాల్చి, దూరంగా వెళ్ళాడు.

"ఇంకా వెళ్ళిపో. ఇంటికి వెళ్ళిపో" అని ఆమె ఆజ్ఞ.

వీపు తిప్పాడు ప్రశ్నలేకుండా ఆమెవేపే. తన ఆత్మవేపే, తన స్వర్గం వేపే వీపు తిప్పాడు.

లోకం కావిలించుకుంది. తన కులట హస్తాలతో అతన్ని మర్యాద, భయం, తన ఆస్తి, కుటుంబం, తన ఆశలు, కలలు - వొస్తున్నారు మనుషులు. తనని అక్కడ చూసివుంటే ఇంకేమన్నా వుందా? కరణంగారి ఇంటో తన పరువు.

తాను తన పక్కమీద వున్నాడు. తంతాడుగావును ఆమెని. అప్పుడే దూరమైపోయింది. ఆమె, మనసుకే కాదు హృదయానికే దూరం ఎందరు పెళ్ళాల్ని ఎందరు తాగుబోతులు తన్నటంలేదు! కౌన్సిల్లో మద్యపాన నిషేధ కార్యక్రమం తన మంత్రిత్వం... మద్యం పోయినా భార్యల్ని తన్నడం మానతారా భర్తలు!

నిద్రపోయినట్టున్నాడు వరండాకింది వెన్నెల్ని గమనించకండానే.

తన పక్కన ఎవరు? తన మొహం మీద ముద్దులు, రహస్యపు మృదువైన మాటలు. నోట్లోంచి వూపిరిలోంచి పచ్చి కర్పూరపు పరిమళాలు. తన రొమ్ము మీద భారం. తన కళ్ళకి అడ్డంగా ముంగురులు చంపకపూల పరిమళం. కల, గొప్పకల.

"ఎట్లా వొచ్చావు? ఏముంది?"

గట్టిగా కావలించుకున్నాడు. ఆ కరణంగారి వరండాలో, దాక్కుంటోంది తనలో, ఇంకా భయంగావును....

కళ్ళు తెరిచాడు. కలకాదు. నిజం, పన్నెండు గంటలు కొట్టారు, ఠాణాలో.

కలా, నిజం, భేదమేమిటి? అని భగవాన్ పుస్తకంలో తాను చదివింది.

"ఏం చేశాడు? ఏమయింది?" అని మాటలతో ఆమె జుట్టులో తను.

"ఎవరు? ఏం చేశాడు? నువ్వూ, నేనూ కాక ఇంకెవరు?" అని ఆమె ప్రకాశించే చూపులు, అతని కళ్ళలో అతని మాటల అర్థం అతుకుతో!

ఎవరిది? ఆమెకాదు తోటలోని లావణ్య కాదు.

తన స్వప్నసుందరి.

"ఇక్కడ వొద్దు, వెళ్ళిపోదాం, మనతోటకి."

"వెడదాం" అన్నమాటలో ఆలస్యం.

"మళ్ళీ వెళ్ళిపోతావా నన్నిక్కడ వొదిలి?"

"నా వంక చూడు" అని ఆమె వేళ్ళ పిలుపు అతని మెడమీద. వెన్నెల మెత్తని కాంతిలో ఆమె కళ్ళ మెరుపుకింద, ఆమె రొమ్ముని చూస్తో. మాధుర్యంతో మత్తెక్కిన వేళ్ళతో ఆడుకుంటో, ఆ తోటలో అమ్మాయిని తలుచుకోడానికన్నా వ్యవధిలేక, అవసరం లేక, ఈమెలో - నిద్ర.

కలలో కలవరం.

"పొడిచేశాడు. రాత్రి పన్నెండింటికి."

"ఎవణ్నో పెట్టుకుందిట రాత్రి."

"ఛా అట్టాంటిది కాదు."

"వాడా? పారిపోయినాడు."

"అతనా! అతనూ కనపళ్ళేదు."

చప్పున కళ్ళు తెరిచాడు. తెల్లారింది. కరణంగారు వెళ్ళబోతున్నారు మనుషుల వెంట.

"ఏదీ ఆమె!"

ఆమె చివరిమాటలు.

"వెడదాం? అక్కడే మన తోటలో వుందాం" అని.

"విన్నారా? ఆమెని, మొన్నరాత్రి రాలా, ఆమెని భర్త పొడిచేశాట్ట - ముక్క ముక్కలుగా కోశాట్ట."

కరణం వెంట తానూ పరుగు.

శవం గుర్తులేని శవం. ఆ ఉదయాన, ఆ చెట్టుకిందే చుట్టూ జనం అతనిలో ఏమీ స్వంత నష్టం పలకటంలేదు. తన మూలంగా తన భీరుత్వం మూలంగా... కాదు ఆమె ఆజ్ఞ మూలంగా.

"రా రా నా దగ్గిరికి రా."

అని గుడిశ వెనకనించి పిలుపు.

ఈ శవం ఆమెకాదు. ఎవరో. ఇక్కడే వుంది ఆమె. దాక్కుంది ఆ గుడిశ వెనక.

గబగబ గుడిశ వెనక్కి వెళ్ళాడు - పక్కన సంపెంగ పొదలోంచి.

'రా రా' అని పిలుపు.

కొమ్మలు వొత్తిగించి చప్పున దూరాడు. కావిలించుకుంది ఓ ఆకారం... లాగింది లోపలికి. ఇద్దరూ కింద పడిపోతున్నారు. తనూ గట్టిగా కావిలించుకున్నాడు.

"ఎవరు?"

"ఎవరో మొగవాడు. ఆమె భర్త తాగుబోతు."

తననించి పెద్ద అరుపు. ఏదో గట్టిబాధ. మూర్ఛ, వెంటనే తెలివి.

చేతుల్లో కావిలించుకుని నవ్వుతోంది ఆమె - తన స్వప్నసుందరి.

"రా వెళ్ళిపోదాం. మన తోటకి."

చుట్టూ గొప్పకాంతి రంగు రంగుల మబ్బుల్లోంచి వెలుతురు ఎవరూ అడ్డంలేని విశాల ప్రపంచం. ఏ ఆలోచనాలేని నిర్మలమైన మనస్సు, కాదు. తనకి మనస్సు లేదు. అసలు లేదు. పుత్తశూన్యం. నవ్వే ఆమె పెదిమల మీదనించి దిక్కుల ప్రతిధ్వనులలో ప్రతిఫలించే నవ్వు - మెరిసే నవ్వు... గంతులేసే నవ్వు తరంగాలు... నిర్మల జలంమల్లే మీది కురికి తేలించే నవ్వు కాంతులు - ఏ బరువూ లేకుండా ఆమె దేహంలో ఐక్యమయ్యే దేహం, దేహంలేదు - కనపడదు, కాని వుంది ఆమెలో కరిగిపోతో.... ఆమె నవ్వు అడ్డంలేకండా తన తలలోనించి కాంతిలో తేలిపొయ్యే ఆమె నవ్వు.

కింద తన పాదాలముందే నెత్తుర్లో దొర్లుతో శ్రీధరరావు ఏమిటి చచ్చిపోయినాడా తాను? చావు ఇంత అందమా? అతని పక్కన ఎర్రని కత్తి. పరిగెత్తే భర్త దూరంగా అదెవరిదో శవం, గుంపు.

"రా."

"ఎక్కడికి?"

"అంతకీ, అక్కడికి, ఇక్కడికి.... ఎక్కడికి..."

అట్లా నవ్వుతో తేలిపోతో....

◆ ◆ ◆

*రచనాకాలం : **15-3-1948***

*ప్రచురణ : **(కొత్తచిగుళ్ళు కథల సంపుటి)** రమణస్థాన్ ప్రచురణ, **1962***